

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 మంగళవారం
సహర్ 5:06 బుధవారం

కన్నుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం 7
రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి 6

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈనెల 21నుంచి ఏప్రిల్ 4వరకు పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాలు




పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఈవో డి.మాధవి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ప్రకాష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. డీఈవో మాధవి మాట్లాడుతూ ఈనెల 21నుంచి ఏప్రిల్ 4వరకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 వరకు జరుగుతాయని, అందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే సుమారు 7వేల మంది విద్యార్థుల కోసం 41పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీటి సరఫరా ఉండేవిధంగా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి పరీక్షల కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీ, మున్సిపల్, పోస్టల్, ట్రెజరీ, అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

పెద్దపల్లి కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఆంగ్ల పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన తెలిపారు. పరీక్షలకు 4801 మంది హాజరు కావాల్సి ఉండగా, 4710 మంది హాజరు కాగా 91మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, 98.10శాతం హాజరు నమోదైందన్నారు.



విద్యుత్ ఉత్పత్తిపై సింగరేణి దృష్టి

సింగరేణి అంటేనే గుర్తుకు వచ్చేది బొగ్గు గనులు, ఓపెన్‌కాస్టులు. వెలికితీసిన బొగ్గును సరఫరా చేసే సింగరేణి క్రమంగా విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టింది. థర్మల్, సౌర విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పుతూ విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాష్ట్రంలోనూ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి విస్తరణపై ఫోకస్...

- 10వేల మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళిక
- రూ.50వేల కోట్ల ఖర్చు అంచనా
- రాజస్థాన్ ఒప్పంద థర్మల్ ప్రాజెక్టులు తెలంగాణలోనే

గోదావరిఖని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ విద్యుత్ ఉత్పత్తి రంగంలో రాణిస్తోంది. ప్రస్తుతం సింగరేణిలో 2/600 థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును మంచిర్యాల జిల్లా జైపూర్‌లో నిర్వహిస్తోంది. 450 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లను కూడా నెలకొల్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. ఒకే సంవత్సరంలో 6/800 అంటే 4800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమైంది.

రామగుండంలో 800మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఈ ప్రాజెక్టును సింగరేణి ద్వారా నిర్మాణం చేయాలని నిర్ణయించింది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎండీ బలరాం నాయక్‌లు 3100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఇందులో 2/800 థర్మల్ విద్యుత్, 1500మెగావాట్లు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం జరిగింది. రాజస్థాన్‌లో బొగ్గు అందుబాటులో లేని కారణంగా థర్మల్ విద్యుత్ ప్లాంట్లను సింగరేణి ప్రాంతాల్లో నెలకొల్పేందుకు ప్రయత్నిస్తు న్నది. సోలార్ ఉత్పత్తి రాజస్థాన్‌లో ఏర్పాటు చేయనున్నారు.

ఒడిశా రాష్ట్రం నైనీ బొగ్గు బ్లాకు సమీపంలో 2/800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేసింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందం కోసం ఎదురు చూస్తున్నది. ఒడిశా లేదా పరిసర రాష్ట్రాల నుంచి పీపీఏ కుదిరితే ఆ రెండు యూనిట్లను నిర్మించేందుకు సింగరేణి సిద్ధంగా ఉంది.

జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో మరో 800మెగావాట్ల థర్మల్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు సింగరేణి పనులు ప్రారంభించింది.

సోలార్ రంగంలో

సింగరేణి సంస్థ ఇప్పటికే 450మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను సింగరేణిలోని వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి చేస్తున్నది. మరో 800మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని మల్లన్నసాగర్, ఎల్ఎండీ జలాశయాల వద్ద ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నది. రామగుండం ప్రాంతంలో మూతపడిన మేడిపల్లి ఓసీపీలో 500మెగావాట్ల సంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. జియో థర్మల్ నుంచి కూడా 200మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలను సిద్ధం చేసింది. మొత్తంగా సింగరేణిలో 8050మెగా వాట్ల నూతన విద్యుత్ ఉత్పత్తి దిశగా ముందుకు వెళుతున్నది. గతంలో ఉన్న 1200మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టుతో కలిపి 9250మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి సింగరేణి సిద్ధమైంది. అంటే ఇది సుమారు తెలంగాణ రాష్ట్రంలో జెన్‌కో ఉత్పత్తులకు దగ్గరగా చేరుకోనున్నది.

బొగ్గు ఉత్పత్తి పెంపుపై కృషి

విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించిన సింగరేణి బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ప్రణాళికలు చేస్తున్నది. ఇప్పటికే 75మిలియన్ టన్నుల బొగ్గు యేటా ఉత్పత్తి చేస్తున్న సింగరేణికి నైని ఓపెన్ కాస్టుల్లో ఈ సంవత్సరం బొగ్గు ఉత్పత్తిలోకి రానున్నది. యేటా 10మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేస్తే నైనీలో మొదటి సంవత్సరం 5మిలియన్ టన్నులు ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నారు. మరో ఏడాదిలో కొత్తగూడెం, ఇల్లందు ప్రాంతాల్లోని జేకే ఓసీ, వీకే ఓసీలు కూడా ఉత్పత్తి లోకివస్తాయి. దీంతో రెండేళ్లలో సింగరేణి సంస్థ 90 మిలియన్ టన్నుల

(మిగతా 8వ పేజీలో)

రూ.50వేల కోట్ల అంచనా...

సింగరేణి సంస్థ 6/800 మొత్తం 4800మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను ప్రారంభిం చేందుకు సుమారు రూ.60వేల కోట్ల వరకు అవసరముంటుంది. రాజస్థాన్‌తో 1500మెగావాట్ల సోలార్‌ప్లాంట్ నిర్మాణా నికి రూ.10వేల కోట్లు అవసరముం టాయి. ఇందులో రాజస్థాన్ వాటా 24శాతం పోగా 76శాతం వాటా సింగ రేణి చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్ల ప్రణాళికతో ఈ ప్రాజెక్టులు, పెట్టుబడులను సింగరేణి అంచనా వేస్తు న్నది. అయితే సింగరేణి సంస్థకు యేటా రూ.4వేల నుంచి రూ.5వేల కోట్ల రూపాయలు లాభాలు వస్తు న్నాయి. బ్యాంకులు, సంస్థల నుంచి రుణాలు తీసుకుని విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. విద్యుత్‌కు యేటా 15శాతం డిమాండ్ పెరుగుతుం డడం తో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సింగరేణి విద్యుత్ ఉత్పత్తి వైపు ఆసక్తి కనబరుస్తు న్నది.

సామాన్యుడికి న్యాయం జరిగేలా కృషి

- ల్యాండ్ మాఫియా, అక్రమ దందాలపై ఉక్కుపాదం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా...



సీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో పోలీసులను ఆశ్రయించే సామాన్యుడికి న్యాయం జరిగేలా చూస్తామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే బాధితులు నేరుగా కలువాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. సోమవారం రామగుండం కమిషనరేట్‌లో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కమిషరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ 24గంటలు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సత్ప్రవర్తన, మంచి నడవడిక కలిగిన వారికి, ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని, అదే సమయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నూతన టెక్నాలజీతో నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్టు సీపీ తెలిపారు. ల్యాండ్ మాఫియా, డ్రగ్స్, గంజాయి రవాణా పట్ల ఉక్కు పాదం మోపుతామన్నారు.

2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి...

అంబర్ కిశోర్ ఝా 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2011లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏఎస్పీగా పని చేసిన 2012లో వరంగల్ ఓఎస్డీగా, అదనపు ఎస్పీగా పని చేశారు. 2014లో వరంగల్ రూరల్ ఎస్పీగా పని చేసిన ఆయన రాష్ట్ర ఏర్పాటు తరువాత భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. 2018లో హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా పని చేసి అదే సంవత్సరం కేంద్ర సర్వీసులో విధులు నిర్వహించారు. గత సంవత్సరం డీఐజీగా పదోన్నతి పొంది రాచకొండ జాయింట్ సీపీగా పని చేశారు. అనంతరం వరంగల్ సీపీగా పని చేసి ప్రస్తుతం రామగుండం కమిషనర్‌గా నియమితులయ్యారు. సీపీకి అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీలు కరుణాకర్, ఏసీపీలు, ఆర్‌ఐలు స్వాగతం పలికారు.

పారిశుధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని పారిశుధ్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఈనెల 10 నుండి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించగా పెద్దకల్వలలో పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలని అధికారులకు సూచించారు. పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, క్రీడా ప్రాంగణాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎంపీడీవో కె.శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, కార్యదర్శి నిషాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ముంగిట్లోకి సంక్షేమ పథకాలు



అంకంపల్లెలో ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే ప్రజల ముంగిట్లోకి సంక్షేమ పథకాలు వచ్చాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం అంకంపల్లెలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో 14వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నాయన్నారు. అంకంపల్లెను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని గ్రామానికి రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా పథకాలు ఇస్తున్నామన్నారు. అంకంపల్లెకు 119ఇండ్లు మంజూరయ్యాయన్నారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఒక్క ఇల్లు, రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో 74శాతం మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, అసెంబ్లీలో ప్రతిపక్షాలు సవాల్ విసిరితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సవాల్ స్వీకరించలేదన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ సర్పంచ్ పూర్ణచందర్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచ్ ఆకుల చిరంజీవి, మాజీ ఎంపీటీసీ కొత్తూరి లక్ష్మిమొండయ్య, ఎండి.సజ్జు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు నిమ్మనపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే ముగ్గు పోసి ప్రారంభించారు. గ్రామంలో 153 మంది లబ్ధిదారులకు దశలవారీగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, కార్యదర్శి రాజ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, నాయకులు ప్రదీప్, గిరినేని సంపత్‌రావు, సంతోష్ యాదవ్, కడార్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మహిళలను మహారాణులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. రామరావుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఏడాదికి 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. రామరావుపల్లిలో 121 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా ప్రకటించామని, అందులో భాగంగానే గ్రామంలో నలుగురికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి, భూమి పూజ చేసి పనులను ప్రారంభించామని పేర్కొన్నారు. త్వరలో అధికారికంగా బండలవాగు ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నాయకుల్లో మార్పురావడం లేదని అన్నారు. మనాలి ఠాకూర్,పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఐజీ శ్రీనివాస్‌కు ఘనంగా వీడ్కోలు

కోల్‌సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ నుంచి బదిలీపై వెళుతున్న ఐజీ శ్రీనివాస్‌కు సోమవారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించి గజ మాలతో సత్కరించారు. వాహనాన్ని తాళ్లతో లాగుతూ ఊరేగించారు.

రామగుండం ఎంతో తృప్తినిచ్చింది...

రామగుండం పోలీస్ కమిషనర్‌గా పని చేసిన సమయం మరువలేదనిదని, ఎంతో తృప్తినిచ్చిందని కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. 13 నెలల పాటు తాను పని చేసిన సమయంలో సహకరించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కష్టపడుతూ అందరి సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలు, వీవీఐపీల కార్యకలాపాలు, పోటీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశామన్నారు.



ఐజీ శ్రీనివాస్ వాహనాన్ని తాళ్లతో లాగుతున్న పోలీసులు

ఎండుతున్న పొలాలు

ముత్తారం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సాగునీరు లేక పారుపల్లి శివారులో సుమారు 50 ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంట పొట్టదశకు వచ్చే సమయానికి సాగునీరు అందక పొలాలు (మిగతా 8వ పేజీలో)



ఎల్‌ఆర్‌ఎస్ లేకుండా రిజిస్ట్రేషన్ చేయవద్దు


పెద్దపల్లిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) ఎల్‌ఆర్‌ఎస్ కాకుండా అక్రమ లేఅవుట్‌లలోని ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌పై అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేఅవుట్ క్రమబద్ధీకరణ 2020 పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి ఫీజుతోపాటు ఓపెన్ స్పేస్‌చార్జిలను మార్చి 31లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఆగస్టు 26, 2020 వరకు 10 శాతం ప్లాట్లు విక్రయించిన లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సబ్ రిజిస్టర్ ద్వారా 10 శాతం ప్లాట్లు విక్రయించిన లేఅవుట్‌లు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు సమర్పించవచ్చన్నారు. క్రమబద్ధీకరణ చేయని ప్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయడానికి వీలులేదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిషేధిత జాబితాలో లేని, బఫర్, ఎఫ్‌టిఎల్, చెరువులు కుంటలు తదితర ప్రాంతాలలో లేని ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతి లభిస్తుందని చెప్పారు. చెరువులు నీటి వనరులు తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు చూడాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారికి స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు గంగయ్య, సురేష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, మనోహర్, తహసీల్దార్లు, అధికారులు, పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించిన 24 గంటల్లో క్రమబద్ధీకరణ

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించిన వారికి 24 గంటల్లో క్రమబద్ధీకరణ పత్రాలు జారీ చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో రియల్టర్లు, డాక్యుమెంట్ రైటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించి ప్రభుత్వం అందించే 25 శాతం రాయితీ పొందేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. జిల్లా పరిధిలో 16 వేల స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధిత ఓనర్లకు ఫీజు వివరాలు తెలియజేశామని, ఇప్పటి వరకు 400 మంది మాత్రమే స్పందించారని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పై సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కమిషనర్ వెంకటేష్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, అధికారులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష



మట్టి కుండ.. సల్లగుండ..

రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి ప్రత్యేక రంజన్లు



సిరిసిల్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాజస్థాన్ రంజన్లు

సిరిసిల్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఈసారి తొందరగానే మండిపోతున్నాడు. ఏప్రిల్, మేలో భగ్గుమనే భానుడు తన ప్రతాపాన్ని చూపించేవాడు. ఇప్పుడు మార్చిలోనే తన పనిని మొదలు పెట్టేశాడు. ఎండ దాహాన్ని తీర్చుకోవడానికి మట్టి రంజన్లను ఆశ్రయిస్తున్నారు. పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన ఆదిలాబాద్ రంజన్లకు పోటీగా ఈసారి గుజరాత్ రాజస్థాన్‌ల నుంచి ఎక్కువగా రంజన్లు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌కు చెందినవారే నేరుగా సిరిసిల్లకు తీసుకవచ్చి అమ్మకాలు సాగిస్తుండడంతో స్థానికంగా సీజనల్ వ్యాపారాలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రంజన్లతో పాటు మట్టి కూజాలు, వంట చేసుకునే మట్టి పాత్రలు కూడా వచ్చాయి. రాజస్థాన్ నుంచి వచ్చిన రంజన్లకు నల్లాలతో పాటు రకరకాల డిజైన్లు ఉండడం, ధర అందుబాటులోనే ఉన్నాయి. రాజస్థాన్ రంజన్లు రూ.150 నుంచి రూ.350 వరకు ఉన్నాయి. మరోవైపు గుజరాత్ నుంచి మట్టి రంజన్లతో పాటు సిరామిక్ రంజన్లు వచ్చాయి. సిరామిక్ రంజన్లు నీటి చల్లదనం ఎక్కువగా ఉంటుందని భావించి కొనుగోలు చేస్తున్నారు. ఈ రంజన్లు రూ.250 నుంచి రూ.500 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. గుజరాత్, రాజస్థాన్‌ల నుంచి ప్రత్యేక కంటైనర్ల ద్వారా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి దిగుమతి చేసుకున్నారు. ఇక్కడి నుంచి మండలాలకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నారు.



రంజన్లు

విద్యార్థులూ.. ఇస్రో పిలుస్తోంది



- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- యువిక-25 కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానం
- దేశ వ్యాప్తంగా నిర్వహణ

చొప్పదండి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువిక)ను నిర్వహిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టబోయే ఈ కార్యక్రమం కోసం తొమ్మిదో తరగతి విద్యార్థులను ఇస్రో ఆహ్వానిస్తోంది. అంతరిక్ష పరిశోధనలో ఇటీవల ఇస్రో 100ప్రయోగాలు పూర్తి చేసుకొని అగ్ర దేశాలకు దీటుగా పరిశోధనలను చేపడుతుండగా ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఇస్రో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

23 వరకు గడువు

విద్యార్థులు మార్చి 23వరకు www.isro.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను వడపోసిన అనంతరం ఏప్రిల్ 7న 337 మంది విద్యార్థులను ఎంపిక చేసి జాబితాను విడుదల చేస్తారు. మే 18 నుంచి విద్యార్థులను కార్యక్రమానికి ఆహ్వానిస్తారు. మే 19నుంచి 30 వరకు యువిక-25 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మే31 తేదీన ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు.

విద్యార్థులకు అన్నీ ఉచితమే

ఇస్రో నిర్వహించే యువిక కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలను ఇస్రో ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14రోజులు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, గ్రహాలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడేఅవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

విద్యార్థుల అర్హత

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులకు 50శాతం వెయిటేజ్ ఇస్తారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లలో విద్యార్థులు ఉంటే ఐదుశాతం, జిల్లా, రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన వకృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 10శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే ఐదు శాతం, పల్లెప్రాంతాలకు చెందిన విద్యార్థులకు 20శాతం ప్రాధాన్యత కల్పిస్తారు.





దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో యువిక నిర్వహణ

ఇస్రో యువిక-25 కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఏడుకేంద్రాల్లో నిర్వహిస్తోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్, కేరళలోని తిరువనంతపురం, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, కర్ణాటకలోని బెంగళూరు, గుజరాత్‌లోని అహ్మదాబాద్, తెలంగాణలోని హైదరాబాద్, మేఘాలయ రాష్ట్రంలోని షిల్లాంగ్‌లో నిర్వహిస్తోంది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై విద్యార్థి ఆత్మహత్య

తిమ్మాపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లికి చెందిన సిరికొండ నిఖిల్‌రావు (22) అనేవిద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొని అప్పులపాలై ఆతహత్యకు చేసుకున్నాడు. మన్నెంపల్లి గ్రామానికిచెందిన సిరికొండ తిరుపతి రావు కుమారుడు నిఖిల్‌రావు హైదారాబాద్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ మూడోసంవత్సరం చదువుతున్నాడు. ఈనెల7న హైదారాబాద్ నుంచి మన్నెంపల్లికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు వెళతానని చెప్పడంతో అతడి తండ్రి కరీంనగర్ బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. 4.45కి తండ్రికి ఫోన్‌చేసి తాను హైదరాబాద్ బస్సు ఎక్కానని చెప్పాడు. ఉదయం 11.45గంటల సమయంలో తిరుపతిరావు వద్ద పనిచేసే శంకర్ పొలానికి నీళ్లుపెట్టి మోటర్‌బంద్ చేయడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి గట్టుమీద చెప్పులు, కర్చీప్ కనిపించాయి. అనుమానం వచ్చిన శంకర్ బావిలోకి తొంగిచూడగా నిఖిల్‌రావు మృతదేహం కనిపించింది. వెంటనే శంకర్ తిరుపతి రావుకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిఖిల్ రావు మృతదేహాన్ని బయటకు తీయించారు. నిఖిల్‌రావు కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.



నిఖిల్ రావు (ఫైల్)

● ఆన్‌లైన్ బెట్టింగే కారణం..

హైదారాబాద్‌లో చదువుకుంటున్న నిఖిల్‌రావు కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. గతంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నిఖిల్‌రావు ఐదు లక్షల వరకు పోగొట్టుకున్నాడు. అతడి తండ్రి ఆ అప్పులు చెల్లించి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడవద్దని మందలించాడు. అయినా తీరు మార్చుకోని నిఖిల్‌రావు తిరిగి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి మళ్లీ డబ్బులు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు కట్టాల్సిందిగా ఇంట్లో అడిగాడు. ఇక తమవల్ల కాదని, చదువుకు మాత్రం డబ్బులు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పులతో ఇబ్బంది పడుతున్న నిఖిల్‌రావు మనస్థాపానికి గురై హైదారాబాద్ వెళ్లలేక, మధ్యలోనే బస్సు దిగి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమశేఖర చిట్ ఫండ్స్ కార్యాలయం ఫర్నీచర్ ధ్వంసం చేసి, తనను నోటికి వచ్చినట్లు దుర్భాష లాడాడని బాధితుడు గూడెం నరేందర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మేడదుల సతీష్ అనేవ్యక్తి సోమశేఖర చిట్‌ఫండ్‌లో రూ.10లక్షల చిట్టి వేశాడు. డబ్బులు మొత్తం కట్టకపోవడంతో రిమైండ్ నోటీస్ పంపించారు. నోటీస్ ఎందుకు పంపా రంటూ తీవ్ర ఆగ్రహానికి గురైన సతీష్ చిట్‌ఫండ్‌కు వెళ్లి మేనేజర్ క్యాబిన్ గ్లాస్ ధ్వంసం చేశాడు. నోటికి వచ్చినట్లు దుర్భా షలాడాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

రుద్రంగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మానాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు రుద్రంగిలోని పెట్రోల్ పంప్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న సిబ్బంది ఈఎంటి వెంకట రమణ, పైలట్ చాణక్యలు తీవ్రగాయాలైన శ్రీకాంత్‌కు ఫస్ట్ ఎయిడ్ చేసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన దర్శనాల కరుణాకర్, ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి మల్లయ్యల ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కరుణాకర్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ చల్మెడ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మల్లయ్యకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం సిరిసిల్ల తర లించారు.

30 ఏళ్ల తర్వాత తల్లిని కలిసిన తనయ

- ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టు వసంత
- పోలీసుల సమాచారంతో తల్లిని కలిసేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్లిన కూతురు

కోరుట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండల సిరికొండ గ్రామానికి చెందిన మావోయిస్టు వసంత అలియాస్ శాంతక్కఅలియాస్ మమతక్కను 30సంవత్సరాల తరువాత ఆమె కూతురు భవాని కలిసింది. అనారోగ్య కారణాలతో పోలీసులకు లొంగిపోయిన ఛత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌కమిటీ సభ్యురాలు వసంతను ఆమె కూతురు భవాని కాంకేర్‌కు వెళ్లి సోమవారం కలిసింది. 2024 నవంబర్‌లో కాంకేర్ పోలీసులు ఆమెతోపాటు మరో ఏడుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. ప్రస్తుతం వసంత మోకాళ్లనొప్పులు, షుగర్‌వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు వసంత గురించి ఆరాతీసి తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నాలుగు రోజుల క్రితం తెలంగాణ పోలీసులు భవాని ఆచూకీ తెలుసుకొని ఆమెతల్లి సమాచారాన్ని చేరవేశారు. ప్రస్తుతం వసంత కూతురు భవాని ప్రేమవివాహం చేసుకొని భూపాలపల్లి జిల్లా పరకాలలో ఉండడంతో కోరుట్ల పట్టణంలోని ఆమె బంధువులకు విషయం తెలియజేశారు. దీంతో స్పందించిన బంధువులు భవానితో కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ప్రత్యేక వాహనంలో వెళ్లారు. దీంతో అక్కడి పోలీసు ఉన్నతాధికారులు విచారణచేపట్టి వారికి సంబంధించిన పత్రాలను స్వీకరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు వారికి తెలిపారు.

● భర్త ఎన్‌కౌంటర్‌లో మృతి..

వసంతభర్త రాంరెడ్డి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినా అజ్ఞాతం వీడి జనజీవనంలోకి రాలేదు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన రాంరెడ్డి 1979లో పీపుల్స్‌వార్‌లో చేరాడు. అప్పుడు పోలీసులు రాంరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలునుండి వచ్చిన అనంతరం కథలాపూర్ మండల సిరికొండ గ్రామనికి చెందిన వసంతతో వివాహం జరిగింది. అనంతరం దంపతులిద్దరూ పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరికికూతురు భవాని జన్మించింది. అనంతరం రాంరెడ్డి-వసంత దంపతులు కూతురును ముంబాయిలో ఉన్న సోదరుడు సాయిబాబకు అప్పగించారు. పసుల రాంరెడ్డి 2001లో ఉత్తర తెలంగాణ స్పెషన్ కార్యదర్శి హోదాలో ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లా ఎలారెడ్డిపేట మండలం మదిమల్ల సమీనంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్న వసంత కాంకేర్ పోలీసుల అదుపులో ఉంది.



పోలీసుల అదుపులో ఉన్న వసంత (ఫైల్)



భవాని

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

- వృద్ధురాలు మృతి ● మరొకరికి స్వల్పగాయాలు

గన్నేరువరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలం లోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి ఓవర్ స్పీడుతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న వృద్ధురాలు బొంగాని రాజమ్మ(88) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బొంగాని రాజమ్మకు బొంగాని మొగిలయ్య, బొంగాని మల్లయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిరువురు తనతల్లిని వంతులవారీగా చూసుకుంటున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పెద్దకొడుకు మొగిలయ్య మందమర్రిలో తన తమ్ముడివద్ద ఉన్న తల్లిని తీసుకరావడానికి తన కొడుకు అనిల్‌కుమార్‌ను మందమర్రికి పంపించాడు. ఆదివారం మందమర్రి నుంచి నానమ్మ రాజమ్మను ఏపి11ఏపి0960 నంబర్ గల కారులో ఎక్కించుకొని అనిల్ కుమార్ హైదరాబాద్ బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని గుండ్లపల్లి స్టేజివద్దకు రాగానే ఓవర్‌స్పీడు వల్ల వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌కు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాజమ్మకు తీవ్రగాయాలు కాగా మనవడు అనిల్ కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే అనిల్‌కుమార్ స్థానికుల సహాయంతో రాజమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. మనవడు బొంగాని అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాధాకిషన్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రామగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన బోనగిరి నర్సయ్య(47)అనే వ్యక్తి సోమవారం బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న నర్సయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కట్టరాజీరుకు చెందిన వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఈత రాని కారణంగా ఊపిరి ఆడక పోవడంతో మృతి చెందాడు. భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జీ దగ్గర కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరి రాజయ్య, గూడూరి కొండాల్‌రెడ్డి కారులో కరీంనగర్‌కు వెళ్లి హుజూరాబాద్‌కు వస్తున్నారు. తాడికల్ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చల్లూరి రాజయ్య, కొండాల్‌రెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మం డలం లోని తాడికల్ గ్రామంలో సోమవారం ఉదయం వీధి కుక్క దాడిలో మూడేళ్ల బాలుడు తీవ్రంగా గాయప డ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కర్జాల కృత్విక్ అనేబాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గాయపడిన బాలుడు కృత్విక్

మద్యానికి బానిసై ఒకరి మృతి

కరీంగనర్ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వేనిగంటి నాగరాజు (35)మద్యానికి బానిసగా మారి డీహైడ్రేషన్‌తో మృతి చెందాడు. మూడోటౌన్ పోలీసుల వివరాల ప్రకారం... హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నాగరాజు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. దీంతోభార్య పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న నాగరాజు సరిగా ఆహారం లేకపోవడం, మద్యానికి బానిసైమత్తులో ఉండడంతో డీహైడ్రేషన్‌కు గురై మరణించాడు. నాగరాజు తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోచమ్మవాడలో ఒకరి హత్య?

- కుళ్లిన స్థితిలో మృతదేహం
- రెండు రోజుల కిందటే ఘటన
- స్నేహితుడే నిందితుడిగా అనుమానాలు?

కరీంనగర్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన బాలసాని రాము(41) మృతదేహాన్ని సోమవారం స్థానిక పోచమ్మవాడలోని ఒకగదిలో కుళ్లిన స్థితిలో పోలీసులు గుర్తించారు. రాము హత్యకు గురైనట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన బాలసాని రాము లక్ష్మీనగర్‌లో భార్య, పిల్లలతో నివాసం ఉంటూ కమాన్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కన క్రషీపాయింట్ నిర్వహిస్తున్నాడు. రాము భార్య లతశ్రీ ఈనెల 5న సంగారెడ్డిలోని తన పుట్టింటికి కూతురుతో కలిసి వెళ్లింది. రాము, అతడి కుమారులు లక్ష్మీనగర్‌లోనే ఉన్నారు. శనివారం రాత్రి 8 గంటలకు సంతోష్ అనేవ్యక్తి రాముకు ఫోన్‌చేశాడు. వెంటనే బైక్‌పై పోచమ్మవాడలోని సంతోష్ వద్దకు వెళ్లాడు. అప్పటి నుంచి రాము తిరిగి లక్ష్మీనగర్‌లోని తన ఇంటికి చేరలేదు. ఈ విషయం మృతుడి కొడుకు తన తల్లి లతశ్రీకి ఫోన్‌లో చెప్పాడు. సంగారెడ్డిలో ఉన్న ఆమె పలుమార్లు రాముకు ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అనుమానించి సోమవారం కరీంనగర్‌కు చేరుకుంది. తన భర్త రాము శనివారం రాత్రి నుంచి కనిపించడం లేదని, అతడి స్నేహితుడు సంతోష్ ఫోన్ చేయగా వెళ్లాడని తెలిపింది. కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు పోచమ్మవాడ లోని సంతోష్ ఇంటికి వెళ్లి తాళం పగులగొట్టి చూశారు. రాము మృతదేహం ముఖం, తల, కాలిపైగాయాలతో రక్తపు మడుగులో కుళ్లినస్థితిలో ఉంది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించగా సంతోష్ మృతుడి బైక్ తీసుకొని కోతిరాంపూర్‌లోని ఒక వైన్‌షాపు వద్దకు చేరుకున్నట్లు, అక్కడ మద్యం కొనుగోలు చేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. మృతుడి బైక్ వైన్‌షాపు వద్ద పార్క్ చేసి ఉంది. సంతోష్ సిద్దిపేట జిల్లాలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తుండగా ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిపై గతంలో కరీంనగర్‌లో ఒక పోక్సో కేసు కూడా నమోదైనట్లు తెలిసింది. రాము భార్య లతశ్రీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




రాము (ఫైల్)

సెలూన్ షాపు దగ్ధం

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ క్రాస్‌రోడ్‌వద్ద ఓ సెలూన్‌షాపులో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. మొలంగూర్ గ్రామానికిచెందిన విజ్జగిరి శివనాగేంద్ర కొన్నిరోజులక్రితం క్రాస్ రోడ్ వద్ద సెలూన్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు సెలూన్‌షాపునకు తాళం వేసి ఇంటికివెళ్లాడు. అర్ధరాత్రి సెలూన్‌లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి శివనాగేంద్రకు సమాచారం అందించారు. వెంటనే శివనాగేంద్ర సెలూన్ వద్దకు చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపకసిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అప్పటికే సెలూన్‌లోని సుమారు లక్ష రూపాయల విలువచేసే సామగ్రి దగ్ధమైంది.

సంఘటనపై కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శివనాగేంద్ర తెలిపారు.



దగ్ధమవుతున్న సెలూన్ షాప్

పేకాట స్థావరంపై దాడి

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామశివారులో స్థావరంపై దాడిచేసి నగదును స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా, నలుగురు తప్పించుకున్నారని, నిందితులపై కేసు నమోదు చేసి రూ.4400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కమాన్‌పూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద పెద్దపల్లి, మంథని ప్రధానరహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన దొంతుల వాణి (49)అనే మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. బైకుపై భార్యభర్తలు కల్వచర్ల నుంచి కమాన్‌పూర్ వెళ్తున్న క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్‌సీఐ ప్రసాద్‌రావు, ఎస్సై కొట్టె ప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. భర్త దొంతుల సురేష్ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్టీపీసీ రక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

- సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్

జ్యోతినగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రక్షణలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీఫోర్స్ (సీఐఎస్ఎఫ్) పాత్ర కీలకమని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం (రైజింగ్ డే) సందర్భంగా సోమవారం సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఈడీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టుల రక్షణతో పాటు ఉద్యోగులను నిత్యంసీఐఎస్ఎఫ్ జవానులు రక్షిస్తున్నారన్నారు. సంస్థ ఆస్తులను కాపాడడం, అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నదన్నారు. పారిశ్రామిక ఆస్తుల రక్షణకోసం ఏర్పడిన సీఐఎస్ఎఫ్ పారా మిలిటరీగా మారి 50ఏళ్లకుపైగా అనేక కేంద్ర ప్రభుత్వసంస్థలకు రక్షణ బాధ్యతలను చూస్తున్నదన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి ఎన్టీపీసీకి సేవలందించాలని చందన్‌కుమార్ కోరారు. రేజింగ్ డే సందర్భంగా బ్యారక్స్ (సీఐఎస్ఎఫ్‌టౌన్‌షిప్)లో జవానులు పరేడ్ నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. సీఐఎస్ఎఫ్ రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ ముఖేష్ కుమార్, డిప్యూటీ కమాండెంట్లు ఆంజనేయరాజు, శాస్త్రి, అధికారులు, జవానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్, సీఐఎస్ఎఫ్ అధికారులు

బీసీలకు అవకాశం కల్పించడం అభినందనీయం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీలు బలహీనవర్గాల నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీట్లు కేటాయించడం అభినందనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే ఎఫెక్ట్ కారణంగానే బడుగు, బలహీన వర్గాల వారికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అవకాశం దక్కిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రాజరాజేశ్వరి గౌడ సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇతర దాతలతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే ఎఫెక్ట్‌తోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు బీసీ నాయకులకు పోటీ చేసే అవకాశం లభించిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ మూడు పార్టీలు ఐదుగురు బడుగు, బలహీన వర్గాలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడానికి బీసీ మంత్రిగా స్వాగతం తెలుపుతున్నానని అన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి 42 శాతం రిజర్వేషన్లు సాధించడంతోపాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఎదగాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు 200 కోట్ల రూపాయల చొప్పున 55 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు 11 వేల కోట్ల రూపాయలు మంజూరు చేయడం సంతోషకరమైన విషయమని, ఇది విప్లవాత్మకమైన నిర్ణయం అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు చేసి నందుకు సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతు న్నానన్నారు. బలహీనవర్గాలకు చెందిన నాయకులకు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడంపై అన్ని పార్టీల నాయకత్వాలకు పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం ట్రస్టు ప్రతినిధులు, నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరీక్షా కాలం.. ప్రణాళిక ముఖ్యం

- ముందస్తు సన్నద్ధతే కీలకం
- వార్షిక, ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు
- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు





గణేశ్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇది పరీక్ష కాలం. వార్షిక పరీక్షలతోపాటు పైచదువుల ప్రవేశ పరీక్షల కోసం సిద్ధమయ్యే సమయం. పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికతో ముందుకెళ్లడం కీలకం. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 నుంచి పదోతరగతి పరీక్షలు మొదలవనున్నాయి. డిగ్రీ వార్షిక పరీక్షలకు తోడు ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షల తేదీలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. కోరుకున్న విద్యా సంస్థలు, కోర్సుల్లో చేరాలనే లక్ష్యంతో చదువుతున్న విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వార్షిక, ప్రవేశ పరీక్షల్లో రాణించేందుకు సమాయత్తమవ్వాలి. అయితే వార్షిక పరీక్షల పాఠ్యాంశాల కంటే అర్హత పరీక్ష ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఇష్టమైన కోర్సు, ఆసక్తి గల కళాశాలల్లో సీటు దక్కాలంటే ప్రతిక్షణం విలువైనదిగా భావించాలి. అప్పుడే విద్యార్థుల కల సాకారం అవుతుంది. పోటీ పరీక్షల్లో సరైన సమయంలో సరైన సమాధానం గుర్తించిన వారే విజేతగా నిలుస్తారు. ఇందుకోసం పోటీ పరీక్షలకు మరింత కష్టపడి చదవాల్సి ఉంటుంది.

కీలక అంశాలు

కొన్ని ప్రవేశ పరీక్షల్లో మినహా విధిగా జనరల్ నాలెడ్జ్ పరీక్షిస్తారు. అందుకే అభ్యర్థి గత ప్రశ్న పత్రాలను పరిశీలించి ప్రశ్నల సరళిపై ఒక అంచనాకు రావాలి. ఒక మార్కు కోసం నాలుగు సమాధానాలు గుర్తించడం, జతపర్చడం వంటి ఎక్కువ ప్రశ్నలు తక్కువ మార్కులు అనే విషయాన్ని గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన, అంతర్జాతీయ సదస్సులు, రాజ్యాంగ సవరణలు, తెలంగాణ ప్రభుత్వ విధానాలు, వర్తమాన అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను గుర్తించాలి. ఇదే కాకుండా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలు అధిక సమయాన్ని తీసుకుంటే మిగతా వాటికి సమాధానాలు గుర్తించే అవకాశం కోల్పోయినట్లే. అయితే సమయ నిర్వహణ ఎంతో కీలకం. పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలి. సరైన నిద్ర, ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

ఇలా చేస్తే ప్రయోజనం

తొలుత ప్రతీ అంశంపై పట్టు సాధించేలా చదవాలి. అర్థం కానివి, పూర్తిగా కఠినమైనవి వదిలి మిగతా అంశాలను వంద శాతం అర్థవంతంగా చదవాలి. రోజులు గడుస్తుంటే పరీక్ష సమీపిస్తుందనే భయం ఉంటుంది. సిలబస్ ప్రకారం ఉత్తమ అంశాలపై ఒక అవగాహన వచ్చిన తర్వాత, పునఃశ్చరణ, సాధన వంటివి ఒక క్రమ పద్ధతిలో అనుసరిస్తే ప్రయోజనం కలుగుతుంది.

- ఉదయం 5 గంటలకు నిద్రలేవాలి.
- 6 నుంచి7 గంటల వరకు గత రాత్రి చదివిన అంశాలను రివిజన్ చేసుకోవాలి.
- 7 నుంచి 10 గంటల వరకు కఠిన అంశాల పఠనం.
- 10 నుంచి 12 గంటల వరకు గ్రూప్ డిస్కషన్.
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 వరకు సందేహాల నివృత్తి అనుభవజ్ఞుల సలహాలు, నిపుణుల శిక్షణ.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గత పరీక్షల ప్రశ్న పత్రాల సాధన.
- సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు అప్పటి వరకు చదివిన అంశాలను మననం చేసుకోవడం.
- రాత్రి 10 నుంచి 11 గంటల వరకు మరోసారి చదవాలి.



సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి

డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



ప్రతీ అంశాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి, కాన్సెప్ట్ అర్థం చేసుకోవడంపై దృష్టి సారించాలి. ప్రణాళిక బద్ధమైన అధ్యయనంతోపాటు సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి. ప్రతి రోజు ఒక నిర్దిష్టమైన సమయంలో చదవాలి. నిరంతర అభ్యాసనం జీవితంలో ఎల్లప్పుడూ అవసరం. దాని ద్వారా కొత్త విషయాలు నేర్చుకుంటాం.

స్వీయ అధ్యయనం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

డాక్టర్ ఎం.కల్పన, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల.



విద్యార్థులు కోచింగ్ తరగతులకు హాజరైనా ఎల్లప్పుడూ స్వీయ అధ్యయనానికి కట్టుబడి ఉండాలి. స్వీయ అధ్యయనం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వారి బలహీనతలు తెలుసుకోవడానికి సహాయపడుతుంది. స్వీయ అధ్యయన సమయాల్లో పునఃశ్చరణ చేసి నిర్ధారించుకోవాలి. ప్రణాళికాబద్ధంగా వ్యూహాన్ని అనుసరించాలి.

పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధం కావాలి

డాక్టర్ ఎన్.మనోజ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్



విద్యార్థులు అకడమిక్ పరీక్షలకుగానీ, పోటీ పరీక్షలకుగానీ సమర్థవంతంగా సన్నద్ధం కావాలి. పరీక్షా సరళిని, సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకోవాలి. వివరణాత్మక అధ్యయన ప్రణాళికను రూపొందించాలి. గత ప్రశ్నపత్రాలు, మాక్ పరీక్షలతో సాధన చేయాలి, పాఠ్యాంశాలు పూర్తిగా చదవడంతోపాటు పునఃశ్చరణకు సమయం కేటాయించాలి, చాలాసార్లు పునఃశ్చరణ చేయడంతో పరీక్షల్లో చేసే చిన్న చిన్న తప్పులను అధిగమించవచ్చు.

పరీక్షల షెడ్యూల్

- ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఎప్‌సెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ).
- మే 2 నుంచి 5 వరకు ఎంసెట్ (బీటెక్).
- మే 2న ఈసెట్(బీటెక్, బీఫార్మసీలోకి లేటరల్ ఎంట్రీ).
- జూన్ 1న ఎడ్‌సెట్.
- జూన్ 6న లాసెట్ (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం).
- జూన్ 8,9 ఐసెట్ (ఎంబీఏ, ఎంసీఏ).
- జూన్ 16, 19న పీజీఈసెట్ (ఎంటెక్, ఎంఫార్మసీ).
- జూన్ 11,14 తేదీల్లో పీఈసెట్ (డీపీఎడ్, బీపీఎడ్).



శివకల్యాణ వేడుకలకు సిద్ధం

- 17న స్వామివారి దివ్యకల్యాణానికి ఏర్పాట్లు
- ఐదు రోజులపాటు కల్యాణ వేడుకలు



వేములవాడ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీపార్వతిపరమేశ్వరుల కల్యాణ వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 17వ తేదిన సోమవారం ఉదయం 10.40 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ముందు భాగంలో స్వామివారి దివ్యకల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు ఐదు రోజులపాటు శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. కాగా 19న బుధవారం సాయంత్రం 3.05 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆర్జిత సేవలు రద్దు..

శివకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని 16వ తేది నుంచి 20వ తేదీ వరకు రాజన్న ఆలయంలో భక్తులు జరిపించుకునే నిత్య కల్యాణం, లింగార్చన, సత్యనారాయణ వ్రతము, అభిషేకములు, అన్న పూజ, సేవల టికెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. 17వ తేది శివకల్యాణం రోజున నిత్యచండీ సహిత రుద్రహోమం టికెట్లు రద్దు చేశారు. అంతే కాకుండా శివకల్యాణోత్సము సందర్భంగా 16వ తేది ఆదివారం కోడె మొక్కులు రాత్రి 11.30 గంటల వరకు కొనసాగుతాయని, 17వ తేదిన సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కోడె టికెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. తిరిగి శివకల్యాణం అనంతరం భక్తులకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు టికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రేపే కామదహన ఉత్సవం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం కామదహన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీన బుధవారం సాయంత్రం ప్రదోషపూజ అనంతరం కామదహన ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. కామదహన ఉత్సవాలను ఈనెల 12త తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు స్వామి కల్యాణ మండపంలో డోలా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రెండు తలలతో కోడిపిల్ల జననం



మల్యాల, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): మల్యాల మండలంలోని కొండగట్టులో కోడిపిల్ల రెండు తలలతో జన్మించింది. సిక్కుల శారద అనే మహిళ కొన్ని రోజుల క్రితం కోడి గుడ్లను పొదిగేసింది. సోమవారం వాటిని చూడగా అందులో ఒకటి రెండు తలలతో జన్మించిన కోడిపిల్ల కనిపించింది. అయితే కాసేపటికే ఆ కోడిపిల్ల మృతి చెందింది. జన్యులోపంతోనే కోడిపిల్ల రెండు తలలతో జన్మించిందని వెటర్నరీ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం

- భక్తులతో కిక్కిరిసిపోయిన క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం
- కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న సేవలో మంత్రి పొన్నం ప్రభాకర్



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయా యి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం కోడె మొక్కు క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ధర్మ దర్శనం, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని రాజ రాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

రాజన్నకు అత్యంత ప్రీతికరమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం గండా దీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని భీమేశ్వర స్వామి ఆలయంలో అభిషేక పూజలు చేశారు. బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం రాజన్న ఆల యానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కోడెపూజతోపాటు ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. కాగా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చింతామణి చెరువు వద్ద పుట్ట బంగారం కోసం స్వామి వారలకు ప్రత్యేక పూజలు

పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవలు ఊరేగింపు

ధర్మపురి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉద యం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండి తులు, అర్చకులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్త మాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆలయం పక్షాన ఈవో అర్చకులకు దీక్షా వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్త మాచార్యులు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు.

సాయంత్రం లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవ మూర్తులను సేవలపై ఆశీనులు చేసి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకు వెళ్లారు. చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్ద సేవలను ఉంచి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకు వచ్చారు. స్వామి వారలకు కరీంనగర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

అలాగే శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన వెన్నెం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు కలిసి మూడు లక్షల విలువ గల మూడు కిలోల వెండితో తయారు చేయించిన శంఖు, చక్రం, ముంజేతులు ఆభరణాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగన భట్ల దినేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు. ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి భారీ బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ మఠం స్థలంలో గల యాగశాల వద్ద నూతన కల్యాణ వేదికపైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి 10 గంటల నుంచి శ్రీ ముదపాక బాల సుందరం భాగవతార్‌చే హరికథ కాలక్షేపం ఉంటుం దని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.





పుట్ట బంగారం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, బ్రహ్మోత్సవాల కోసం ఆలయానికి వస్తున్న భక్తులు, ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, స్థానికులు

కొండగట్టులో ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు వేకువజామున తిరుమం జనము, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవిత్రాహ్వానము, పుణ్యాహవాచనము, రక్షాబంధనం, రుత్విక్‌వరుణం, యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతార్చన, అగ్ని ప్రతిష్ఠ, హవనం, శ్రీ స్వామి వారికి అభిషేకం, అర్చన, మహనివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంకాలం శ్రీ విష్ణు సహస్ర నామ, హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. అనంతరం స్థాపిత దేవతారధన, హవనం, పవిత్రలకు జలాధివాసం, ధాన్యాదివాసం, బలిహరణం, వేదసదస్యం, మంత్రపుష్పం, శాత్తుమొర, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు సామూహిక భజనలు, రామనామ సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సుల్తానాబాద్, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు హోమాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎదుర్కోళ్ల ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అందరూ ఊరేగింపుగా వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకొని కల్యాణం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, ఆలయ చైర్మన్ పల్లా మురళి, డైరెక్టర్లు, పుర ప్రముఖులు,భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిపై సింగరేణి దృష్టి

(5వ పేజీ తరువాయి)

బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పెంచుకోనున్నది. సింగరేణి ప్రాంత బొగ్గు బ్లాకుల విషయంలో మీనమేషాలు లెక్కబెట్టిన సంస్థ టెండర్లలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సింగరేణి ప్రాంత బొగ్గు బ్లాకులను సాధించుకోవాలని యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నాయి.

● గుదిబండలా బకాయిలు...

సింగరేణి బొగ్గు, విద్యుత్ రంగాల్లో దూసుకెళుతున్న ప్పటికీ సింగరేణి సంస్థకు రావాల్సిన వేల కోట్ల బకాయిలు సంస్థ ప్రగతిని వెనక్కి లాగుతున్నాయి. సింగరేణి సంస్థ వార్షిక టర్నోవర్ రూ.35వేల కోట్లు. సింగరేణి రావాల్సిన బకాయిలు రూ.36వేల కోట్లకుపైగా పేరుకు పోయాయి. అంటే ఒక సంవత్సరం సంస్థ టర్నోవర్ కంటే బకాయిలే ఉన్నాయి. జెన్‌కో, రాష్ట్ర ప్రభుత్వం నుంచే అత్యధిక బకాయిలున్నాయి. జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో 1200మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటున్నది. ప్లాంట్ మొదలైనప్పటి నుంచి ఉత్పత్తికి సంబంధించి చెల్లింపులు జరుపలేదు. రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కోకు కోట్ల రూపాయల బకాయిలు ఉన్న కారణంగా జెన్‌కో నుంచి సింగరేణి రావాల్సిన రూ.20వేల కోట్లకు పైబడిన బకాయిలను సింగరేణికి ఇప్పటించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. రూ.50వేల నుంచి రూ.60వేల కోట్ల పెట్టుబడులతో మూడేళ్లలోనే విద్యుత్ ప్లాంట్లను ప్రారంభించాలను కుంటున్న సింగరేణికి బకాయిలు గుదిబండలా మారాయి.

ఎండుపోతున్న పొలాలు

(5వ పేజీ తరువాయి)

ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారుపల్లి, శాత్రాజ్‌పల్లి, సాలగుండ్లపల్లి శివారులో మానేరు నదిపై ఆధారపడి రైతులు పంటను పండిస్తున్నారు. అయితే రైతులు మానేరులో నీరు ప్రవహిస్తున్న సమయంలో ఒడ్డున మోటారు ఏర్పాటు చేసుకొని పొలాలకు నీరు అందిస్తున్నారు. ప్రస్తుతం మానేరు నదిలో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. మానేరు నదిలో బోరు వేస్తే బండలు అడ్డువచ్చి నీరు రాలేదని, ఎక్కడో ఒకచోట నీరు వచ్చినా పది నిమిషాలు వ్యవధిలోనే ఆగిపోతుందన్నారు. దీంతో పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్టదశకు వచ్చే సమయానికి నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఎకరానికి సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని, నష్టపోయే పరిస్థితి నెలకొందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలి

ముత్తారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్కారం, సర్వారం మైదంబండ, పోతారం, కేశనపల్లి, అడవి శ్రీరాంపూర్, ఓడేడ్ శివారులో హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వ్యవసాయ బావి, బోర్లకు పైప్ లైన్లకు చెట్లకు నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలన్నారు. నష్టపరిహారం పూర్తి స్థాయిలో చెల్లించకుండ పనులు మొదలు పెట్టి పంటలు ధ్వంసం చేశారని ఆరోపించారు. పొలాల్లో పనులు నిర్వహిస్తే రైతులతో అడ్డుకుంటామని మాజీ ఎంపీపీ హెచ్చరించారు.

ఊరు పోచమ్మ ఆలయంలో ఘనంగా పూజలు

ఓదెల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఊరపోచమ్మ ఆలయంలో సోమవారం ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామస్థులు పూజలు నిర్వహించారు. రూ.30.50 లక్షలతో పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూఫ్ లెవెల్ వరకు ఆలయం పనులు అయిన సందర్భంగా, ఆలయంలో పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మీ, చిన్నస్వామి చీకట్ల మొండయ్య, బోడకుంట శంకర్, మహేందర్, రాజారాం, సతీష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నేడు కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం కాలనీలో కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ నూక రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. సత్యసాయి సేవామందిరంలో ఉదయం 10 గంటల నుంచి వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నూక రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాదకర మూలమలుపుల వద్ద చెట్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


ఎక్స్‌కావేటర్‌తో చెట్ల తొలగింపు

మంథనిరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రమాదకర మూల మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఏసీపీ మడత రమేష్ ఆదేశాల మేరకు మంథని పోలీసులు కృషి చేస్తున్నారు. ప్రమాదకరంగా మూల మలుపులు- గుంతలమయంగా రహదారి అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి గోదావరిఖని ఏసీపీ స్పందించి మంథని పోలీసులను ఆదేశించారు. ఎస్ఐ రమేష్ మండలంలోని బిట్టుపల్లి రహదారి వెంట ఉన్న పలు మూల మలుపుల వద్ద చెట్లను, కొమ్మలను ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. రోడ్డును అగుకనిపించేలా చదును చేయించి గుంతలను పూడ్చి వేయించారు. పోలీసుల సేవలను పలువురు ప్రయాణికులు అభినందించారు.

ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్, కాంగ్రెస్

కళ్యాణ్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం జైళ్లకు వెళ్లి వచ్చిన ఉద్యమకారులను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు విస్మరించాయని టీఆర్ఎస్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొని జైళ్లకు వెళ్లి వచ్చిన ఉద్యమకారులను పదేళ్ల పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని, ఉద్యమకారులకు కనీస న్యాయం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు 200చదరపు గజాల ఇంటి స్థలాన్ని, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. సమావేశంలో నాయకులు వాసంపల్లి ఆనంద్‌బాబు, ఈదునూరి నర్సింగ్, తోడేటి స్వరూప, చిలుముల సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

కోల్‌సిటీటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరాటే శిక్షణతో మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ అన్నారు. సోమవారం ఆర్‌సీఓఏ క్లబ్‌లో జపాన్ షిటోరియో కరాటే స్కూల్ రాష్ట్ర చీఫ్, బెల్ట్ ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రేడింగ్ బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. కరాటే ఆడపిల్లలకు అవసరమని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు దోహద పడుతుందన్నారు. కరాటే విద్యను నేర్చుకోవడానికి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆమె అభినందించారు. గ్రేడింగ్ బెల్ట్ పరీక్షలో సుమారు 100 మందికిపైగా పాల్గొని ప్రతిభను కనబరిచారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, స్వరూపరాణి, జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం.రమేష్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, అబిజ్ఞ, శివ, నివేదన్, శీభశ్రీ, ముక్తిశ్రీ, సునీహ, సుల్తానా, గాయత్రి, పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లను పూర్తి చేయండి

కళ్యాణ్‌నగర్, మామిర్చ 10 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఫోరింక్లయిన్ గడ్డ వద్ద ఉన్న ఈద్గాలను సందర్శించారు. రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద అసౌకర్యాలు లేకుండా చూడాలని, ఈనెల 31న ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, ఇందు కోసం మ్యాట్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. సింగరేణి, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

మహిళలను హింసిస్తే సహించేది లేదు


సఖి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఎవరైనా హింసిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హెచ్చరించారు. రంగంపల్లిలో రాష్ట్ర మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ మిషన్ శక్తి గ్రాంట్ ద్వారా 48 లక్షలతో నిర్మించిన సఖీ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బాలికలు, స్త్రీలపై జరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని అన్నారు. మహిళా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సఖీ కేంద్రం సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. జిల్లా సంక్షేమాధికారు వేణు గోపాల్ రావు, మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, సఖీ కేంద్రం బాధ్యులు స్వప్న, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాల్లో సోమవారం రూ.37 లక్షల వ్యయంతో నిర్వహించే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. మండలంలోని కనగర్తి, బాయమ్మపల్లి, ఇందుర్తి గ్రామాల్లో రూ. 25 లక్షలతో నిర్మించే ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే సీసీ రోడ్లు, గూడెంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించే మహిళ స్వశక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి తో పాటు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ అధికారికి నివాళి

జ్యోతినగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఝార్ఖండ్‌లోని కిరందాయి ఎన్టీపీసీ కోల్‌మైన్ ఏరియాలో హత్యకు గురైన సంస్థ అధికారి కుమార్ గౌరవ్‌కు సోమవారం రాత్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో నివాళులర్పించారు. రామగుండం ఎన్టీపీసీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, అధికారుల సంఘం నాయకులు విశ్వనాథ్, అహాషేక్ కట్వారి, గుర్తింపు యూనియన్ నాయకులు వి.కృష్ణయ్య, రాజేశ్వర్, మాజీ కార్పొరేటర్ కొలిపాక సుజాత, బీఎంఎస్ నాయకుడు సాగర్‌రాజు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి


కేక్‌కట్ చేస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్‌లను, సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ అన్నారు. మహిళా దినోత్సవ వేడుకలను మెప్మా ఆధ్వర్యంలో సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరుణశ్రీ మాట్లాడుతూ అగ్ర స్థానాల్లో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకొని జీవితంలో పైకి ఎదగాలన్నారు. మానసిక ఒత్తిడిని జయించడానికి ఆటలు ఉపకరిస్తాయన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఉత్తమ సేవలందించిన మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, మెప్మా టీఎంసీ మౌనిక, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఊర్మిళ, శ్వేత, ప్రియ దర్శిని, శమంత, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నూనె లతా మోహన్, ప్రతినిధులు వెంగళ పద్మలత, పరిపూర్ణ పాల్గొన్నారు.

సామర్థ్యాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారిని మాధవి

పెద్దపల్లికల్చరల్,మార్చి 10(ఆంధ్రజ్యోతి): సామర్థ్యాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో డి.మాధవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండురోజులుగా జరిగిన ఏఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీఈడీ ఛాత్రోపాధ్యాయులు 55 మంది తెలుగు, గణిత, ఆంగ్ల సబ్జెక్టులలో రెండో తరగతి విద్యా ర్థులకు సామర్థ్యాల సర్వే నిర్వహిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. శిక్షణలో ఎంపిక చేసిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను సర్వే చేస్తారని, మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఏఎంఓ షేక్, కోర్స్ డైరెక్టర్లు ప్రవీణ్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): ఎస్‌సీఈఆర్‌టి ఆధ్వర్యంలో ఎంపికైన ఆరు పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల ప్రతిభపై బీఈడ్ విద్యార్థులు సోమవారం సర్వే నిర్వహించారు. గుంపుల, పిట్టల ఎల్లయ్యపల్లి, మడక, గూడెం, కనగర్తి పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో ఫీల్డ్ ఇన్వేస్టిగేటర్లు సర్వే నిర్వహిస్తారని ఎంఈఓ రమేష్ తెలిపారు. ట్రైనీలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): తెలుగు, ఆంగ్లం, గణితంలో వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎఫ్ఎల్ఎన్ జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎన్.రవి అన్నారు. ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. 1నుండి 5 తరగతుల పిల్లల ప్రతిభ అంశాలను పరీక్షించారు. తెలుగు, ఆంగ్లం, పాఠ్యపుస్తకాలను చదివించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, సునీత, అమృతసురేష్‌కుమార్, శ్రీవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

సుల్తానాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్‌సి వర్గీకరణ సక్రమంగా అయ్యేంత వరకు గ్రూప్ 1,2,3 ఫలితాలు విడుదల చేయొద్దని సుల్తానాబాద్‌లో సోమవారం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వర్గీకరణ పూర్తయిన తరువాతనే ఫలితాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి రుద్రారపు రాంచందర్, రాష్ట్ర నాయకులు అంబాలా రాజేందర్, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కనకం శంకర్, ఉపాధ్యక్షులు గంగారాం, మాజీ సర్పంచ్ చంద్రమౌళి,మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, ఇరుగురాళ్ళ మాణిక్, పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

కోల్‌సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో సోమవారం నుంచి సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైంది. జోన్‌కు ఒక డివిజన్ చొప్పున రోజుకు 12 డివిజన్‌లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇతర డివిజన్‌లలో పని చేస్తున్న సిబ్బందిలో కొందరు సేవలను ప్రస్తుతం ఉన్న సిబ్బందికి అదనంగా ఉపయోగించుకుంటూ పారిశుధ్య పనులు చేపడుతున్నారు. నిలువ ఉన్న చెత్త కుప్పలను తొలగించడం, మురుగు నీటి కాలువల్లో పూడికతీత పనులను నిర్వహిస్తున్నారు. సోమవారం నుండి ప్రారంభమైన ఈ స్పెషల్ డ్రైవ్ ఈ నెల 14వరకు కొనసాగనుంది. నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న డివిజన్లను సందర్శించి పనులు పరిశీలించారు. పారిశుధ్య అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుట్ట మధు

మంథని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నేతలు సోమవారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ స్త్రీలకు, బాలికలకు విద్య అందించడానికి పూలే దంపతులు చేసిన త్యాగాలను, పోరాటాలను కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల్లో విద్య ద్వారా చైతన్యాన్ని నింపిన వారి సేవలు చిరస్మరణీయమన్నారు. ఏగోళపు శంకర్‌గౌడ్, అనంతరెడ్డి, వంశీ, దేవళ్ళ విజయ్‌కుమార్, మంథని సత్యం, కుదుదుల వెంకన్న, తోకల మల్లేష్, బెజ్జంకి డిగంబర్, బూడిద తిరుపతి, మంథని లింగయ్య, విరురాల ప్రసాద్‌లు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలె వర్ధంతిని ఈవీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయి చిత్రపటానికి సంస్థ చైర్మన్ ఇరికి మహేష్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. చిన్న రాజిరెడ్డి ఐదరి అశోక్, వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ బస్టాండ్ ఆవరణలో సావిత్రి బాయిపూలే వర్ధంతిని బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు తోట రాజ్‌కుమా ర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నల్లవెల్లి శంకర్, రాము, బొమ్మగాని అనిల్‌గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, మల్లన్న, సాయికుమార్, దాసరి రామస్వామి, దాసరి రామచంద్రం, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


ప్రజావాణిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగుండం మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన బిసరిత గ్రామం ఆర్ఎఫ్‌సీఎల్‌లో ముంపు గ్రామమని, సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ పక్కనే ఉంటుందని, ఔట్ సోర్సింగ్ లో ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పెద్దపల్లి పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన బొంకూరి ప్రవీణ్ తమ కాలనీలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుందని దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్‌కు రాస్తా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుకు రూ.50వేల ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు బండెల రాజశేఖర్‌కు రోడ్డు ప్రమాదంలో కాలుతొలగించగా జిల్లా అధికారుల సంఘం నాయకులు సోమవారం చిన్నరాతుపల్లి గ్రామంలో బాధితుడిని పరామర్శించి రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి పడిగల ప్రవీణ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని జిల్లా పరిశ్రమల అధికారి ఎ.కీర్తికాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ స్కీంలో భాగంగా 35 శాతం రాయితీతో యూనిట్ల ఏర్పాటుకు రుణాల మంజూరుకు ఈనెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. రైస్‌మిల్లులు, వాటికి సంబంధించిన సార్ట్‌టెక్స్ మెషీనరికి సంబంధించి సబ్సిడీ రుణ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, కరెంట్ బిల్లు, యూనిట్ వివరాలతో డీఆర్‌పీ రామకృష్ణను 6305345388 నంబర్‌కు సంప్రదించాలన్నారు. దరఖాస్తును జిల్లా పరిశ్రమల కేంద్రం, రూమ్ నెం. 231 , సమీకృత జిల్లా అధికారుల సముదాయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో 2డీ ఎకో సేవలు


కలెక్టర్ కలిసిన కార్డియాలజిస్టు డాక్టర్ ప్రియాంక

పెద్దపల్లిటౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు 2డీ ఎకో సేవలు అందించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం కలెక్టర్‌ను మాతా శిశు ఆసుపత్రిలో క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రిలోని అన్ని రకాల పేషంట్లకు ఉచితంగా 2డీ ఎకో సేవలు అందిస్తామన్నారు. అవసరమైన రోగులు ఈ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

వేలంలో పాల్గొనకుండానే బొగ్గు బ్లాకులు కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు

గోదావరిఖని, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి బ్లాకులు సింగరేణికే చెందాలని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలు ఆందోళనలు నిర్వహించి, వేలంలో పాల్గొనాలని ముఖ్యమంత్రికి మెమోరాండం ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పేర్కొన్నారు. సోమవారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో సమావేశం జరిగింది. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జీ రాములు, టీ ఎన్‌టీయూసీ నాయకులు ఏడుకొండలు మాట్లాడుతూ సొంత ఖర్చులతో సింగరేణి బొగ్గు బ్లాక్ లను గుర్తించిందని, కేంద్ర ప్రభుత్వం గనుల పాలసీ తీసుకొచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా ఉన్న అనేక బొగ్గు బ్లాకులు వేలం ప్రక్రియలోకి పోయాయన్నారు. సింగరేణి బ్లాకులపై కూడా వేలంలో పాల్గొనాలని ఒత్తిడి తీసు కొచ్చారని, సింగరేణి బ్లాకులు సింగరేణికే చెందాలని, అన్ని కార్మిక సంఘాలు ఆందోళనలు నిర్వహించాయని, సింగరేణి బ్లాకుల వేలం ప్రక్రియ స్తబ్దతగా ఉందన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల ఆశలకు, ఆకాంక్షలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఐ కృష్ణ, జక్కుల నారాయణ, నరేష్, జైపాల్‌సింగ్, ఎస్ రాజన్న, పాల్గొన్నారు.

సాప్ వినియోగంపై శిక్షణ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సాప్ వినియోగంపై సోమవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో కార్పొరేట్ ఐటీ విభాగం అధికారులు అవగాహన కల్పించారు. శిక్షణలో కార్పొరేట్ సీనియర్ ప్రోగ్రామర్ శంకర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ సిస్టం ఎన్టీపీపీ తిరుమలు లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు సింగరేణిలో ఉత్తర, ప్రత్యుత్తరాలు, సర్క్యులర్ లు కాగితాలపై జరుగుతున్నాయని, ఇక మీదట సాప్ ఫైల్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే ప్రోగ్రాంను రూపొందించినట్టు ఐటీ ప్రోగ్రామర్లు తెలిపారు. దీనిని వినియోగించడం ద్వారా కాగిత రహిత పనులు జరుగుతుందని, సమయం ఆదా అవుతుందని వివరించారు. సమాచారం ఎప్పటికీ ఆన్‌లైన్‌లో భద్రంగా ఉంటుందని తెలిపారు. మేనేజ్‌మెంట్ ట్రైనీసిస్టం ఎం అశ్వనీతో పాటు ఏరియా పరిధిలోని అధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్ గేమ్‌లతో ఐకమత్యం ఏర్పడుతుంది

ఆర్జీ-3 జీఎం : సుధాకర్‌రావు


విజేతలకు బహుమతి అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రూప్ గేమ్‌లతో ఐకమత్యం ఏర్పాడుతుందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హజరైయ్యారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యేటా పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. బి-జోన్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన జేఎన్టీయూ జట్టుకు షీల్డ్‌ను అందజేశారు. డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్, ఆడ్రియాల ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, కళాశాల పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి, పిడి సునీల్, ఫీజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఐకే1ఏ గనిలో కార్మికుడి మృతి

జైపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం 1ఏ గని బొగ్గు గనిలో విధులు నిర్వహిస్తూ సింగరేణి జనరల్ మజ్దూర్ కార్మికుడు పచ్చునూరి రాంచందర్ (32) సోమవారం మృతిచెందాడు. రాంచందర్ యాక్టింగ్ మ్యాన్ రైడింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం మొదటి షిఫ్టు పనుల్లో భాగంగా గని భూగర్భంలోని మూడవ డీప్, జీరో లెవెల్ వద్ద గల రెండో మ్యాన్‌రైడింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మ్యాన్ రైడింగ్ స్టేషన్‌లోనే రాంచందర్ కుప్పకూలి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు, అధికారులు ఆర్కే 8 డిస్పెన్సరీకి , అక్కడ నుంచి రామకృష్ణపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం దాసరిపల్లి గ్రామానికి చెందిన వాడని, ఇంకా వివాహం కాలేదని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం సరికాదు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఆర్థిక సంక్షోభం సాకు చూపుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా దాటవేసే ధోరణి అవలంభించడం సరికాదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారావులు ప్రకటనలో పేర్కొన్నారు. నవంబరు 28న జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ప్రతిపాదనలపై యాజమాన్యం స్పందించిన తీరు బాధ్యతారాహిత్యంగా ఉన్నట్టు తెలిపారు. సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్ చేయడం వంటి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా యాజమాన్యం ముందడుగు వేయలేదని తెలిపారు. సింగరేణి సొమ్మును ధారాదత్తం చేస్తూ, కార్మిక సంబంధిత సమస్యలకు ఆర్థిక ఇబ్బందులు అంటూ సాకుచూపడాన్ని ఖండిస్తున్నట్టు వారు తెలిపారు. ఐదేళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు 35 వేల కోట్లు వసూలు చేయాలన్నారు. మారు పేర్ల అంశాన్ని సైతం పక్కనపెట్టారని, సొంతింటి పథకాన్ని కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నారని రాజారెడ్డి, నరసింహారావులు తెలిపారు. ఏఐటీయూసీ కార్మికులను మోసం చేస్తున్నదని, సమస్యలపై స్పష్టత ఇవ్వకపోవడం, ప్రశ్నించకుండా మౌనంగా ఉండడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సమస్యలపరిష్కారానికి ఉద్యమిస్తే సీఐటీయూ కలిసి వస్తుందని తెలిపారు.